క్లుప్తంగా

శివ భక్తుల సందడి



పాతపట్నంలో శివభక్తులు

పాతపట్నం: పర్లాకిమిడికి (ఒడిశా) చెందిన శివ భక్తులు పాతపట్నం మీదుగా కాలినడకన శ్రీముఖలింగం వెళ్లారు. పాతపట్నంలోని నీల మణిదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారంతో బోల్‌భమ్ దీక్ష ముగిస్తుందని శివభక్తులు తెలిపారు. శ్రావణం మాసం తొలి సోమవారం నుంచి బోల్‌భమ్ దీక్ష చేపట్టామన్నారు. పర్లాకిమిడిలోని మహేంద్ర తనయ నదీలోని పవిత్ర జలాలను కావిళ్లతో శ్రీముఖ లింగం తీసుకెళ్లి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

ఎంఈఓగా రాములు



ఎంఈఓ రాములును అభినందిస్తున్న హెచ్‌ఎంలు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస ఎంఈఓగా కె.ఎ.రాములు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంఈఓ-1గా పనిచేసి డి.రాజేశ్వరప్రసాద్ ఇటీవల ఉద్యోగ విరమణ చేపట్టారు. ఆయన స్థానంలో రాములు పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేశారు. రాములును ఎంఈఓ-2 టింగ రాజు, పలువురు హెచ్‌ఎంలు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



మీరాబాయి

కొత్తూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ సహాయకురాలిగా జన్ని మీరాబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ నీరజ తెలిపారు. ఇంతవరకు పాతపట్నం పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌లో జూనియర్ సహాయకురాలి మీరాబాయి పని చేశారు. మీరాబాయికి ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రికార్డుల ట్యాంపరింగ్‌పై దర్యాప్తు



విచారణ చేపడుతున్న రెవెన్యూ అధికారులు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని బొర్రంపేట వీఆర్‌ఏ దుర్గారావుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. అటవీ భూములకు సంబంధించి రికార్డులను ట్యాంపరింగ్ చేశారని దుర్గారావుపై జిల్లా స్థాయిలో ఫిర్యాదులు వెళ్లిన సంగతి తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు బొర్రంపేట సచివాలయంలో విచారణ చేపట్టారు. పోలీసుల సమక్షంలో ఫిర్యాదుదారుడు శ్యామసుందరరావు, వీఆర్‌ఏ దుర్గారావు నుంచి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఈ విచారణ బృందంలో ఆర్ఐ గవరయ్య, సర్వేయర్ రామగణపతి, తదితరులు ఉన్నారు.

72 మందికి నేత్ర పరీక్షలు



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అరుణకుమారి

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో సత్యసాయి బాబా మందిరంలో జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ, శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కె.అరుణ కుమారి 72 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. 39 మందికి కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జి టి.రామారావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాలపోలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

సారవకోట: మండలంలోని మదనాపురం గ్రామంలో సోమవారం పాలపోలమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా సుమారు రూ.20 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. అమ్మవారి దర్పదర్శనం, నిజ దర్శనాన్ని రుత్వికులు చేపట్టారు.

బీమా అమలయ్యేదెప్పుడు?

- ఉచిత బీమా కోసం 14 నెలలుగా ఎదురు చూపులు
- కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్భాటంగా ప్రకటన
- 2024 మార్చి నుంచి అర్హులైన కుటుంబాలకు మొండి చేయి
- అధికారంలోకి వచ్చాక పథకం ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం

చంద్రన్న బీమా పథకం

- సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా సౌకర్యం

చంద్రన్న బీమా అమలు చేస్తామని ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టోలో ముద్రించిన దృశ్యం

నరసన్నపేట: ఎన్నికల సమయంలో గద్దెనెక్కేందుకు కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక పథకాల అమలును కూటమి సర్కార్ గాలికి వదిలేసింది. కనీసం బీమా పథకమైనా అమలు చేస్తే కాస్త భరోసా ఉంటుందని, పేద ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పథకం పేరును వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా మార్చిన కూటమి ప్రభుత్వం.. అమలు చేసే విషయం మాత్రం గాలికి వదిలేసింది. దీంతో సహజ మరణంతోపాటు ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలు ఏడాది కాలంగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అసలు బీమా పథకం ఇస్తారా.. ఎత్తేస్తారా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, అంత్యోదయ, తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారంతా ఉచిత బీమా పథకానికి అర్హులు. నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో గడిచిన ఏడాది కాలంగా వివిధ కారణాలతో మృత్యువాత పడినవారు సుమారుగా 410 మందిపైగా ఉన్నారు. బీమా పథకం అమలు చేస్తారో, లేదోనని ఆయా కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో పక్కాగా వైఎస్సార్ బీమా..

గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమాను అమలు చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ పేదోడికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత అందించారు. వెలుగు సీఎఫ్‌లు నేరుగా బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి బీమా సొమ్ము మరణానంతరం రెండు విడతలుగా అందించేవారు. మృతి చెందిన రోజే వెళ్లి దహన ఖర్చుల కింద రూ.10 వేలు, మరో ఆరు నెలలు తరువాత మిగిలిన డబ్బు అందించేవారు. సవ్యంగా సాగుతున్న ఈ పథకానికి సార్వత్రిక ఎన్నికల తర్వాత గ్రహణం పట్టింది.

రూ.10 లక్షల హామీ ఏమైంది..

బీమా పథకంలో సమూల మార్పులు తెస్తాం, అర్హులందరికీ న్యాయం చేస్తాం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికి రెట్టింపు సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామని ఊరూరా ప్రచారం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ముద్రించి ఇంటింటికీ పంచిపెట్టారు. అధికారం చేపట్టాక ఎప్పటిలానే మరిచిపోయారు. 2024 మే 13వ తేదీ నుంచి బీమా పథకం వివరాలు వెబ్‌సైట్ నుంచి తొలగించారు. తర్వాత నమోదుకు అవకాశం కల్పించలేదు. అప్పటి నుంచి ఎన్నో కుటుంబాలు రోడ్డుపాలై బీమా కోసం ఎదురు చూస్తున్నాయి.

ఎటువంటి అనుమతులు రాలేదు

ప్రభుత్వం నుంచి చంద్రన్న బీమా పథకానికి సంబంధించి ఎటువంటి మార్గదర్శకాలు ఇంకా రాలేదు. ఈ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే అర్హులను గుర్తించి వారికి బీమా వర్తింపజేస్తాం.

– అప్పలరామయ్య, ఏపీఎం, నరసన్నపేట

పేద కుటుంబాలకు అండగా ఉండేది..



గత ప్రభుత్వ కాలంలో వైఎస్సార్ బీమా పథకం అమలులో ఉండేది. కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు వచ్చేవి. దహన ఖర్చుల కింద రూ.10 వేలు అందించేవారు. పేద కుటుంబాలకు ఎంతగానే అండగా ఉండేది.

– బొబ్బాది ఈశ్వరరావు, గోపాలపెంట, నరసన్నపేట మండలం

ఎన్నికల హామీ నెరవేర్చాలి



చంద్రన్న బీమా పేరిట అర్హులకు బీమా అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీని ప్రకారం బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ఈ బీమా పథకం లేని కారణంగా కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీ మేరకు ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

– కొన్న శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బుచ్చిపేట, నరసన్నపేట మండలం

నరసన్నపేట నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో అమలు చేసిన వైఎస్సార్ బీమా వివరాలు..

మండలం	నరసన్నపేట	జలుమూరు	పోలాకి	సారవకోట
బీమా అందిన కుటుంబాలు	193	126	139	73

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ

సారవకోట: ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.సత్యనారాయణ సూచించారు. గత మూడు రోజుల నుంచి బుడితి రైతు సేవా కేంద్రంలో మండలంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఇస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువగా పెరగడంతో నేల సారం తగ్గుతుందన్నారు. ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో ఆరోగ్యకరమైన పంటలు పండుతాయన్నారు. మాస్టర్ ట్రైనీ రమణ పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

సరుబుజ్జిలి: గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామంలో సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి సాహితీ ప్రియదర్శిని, సీహెచ్‌ఓ మోహన్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ సూర్యం, హెల్త్‌సూపర్ వైజర్ మోహన్‌రావు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

పాతపట్నం: మండల కేంద్రంలోని ఆల్ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి సోమవారం పరిశీలించారు. గతంలో ఈ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కలెక్టర్‌కు, ఆర్డీఓకు ఫిర్యాదులు అందాయి. రోడ్డు పక్కన యార్డ్ ఉండడంతో దుర్వాసన వస్తుందని ఫిర్యాదు చేశారు. డంపింగ్ యార్డ్‌కు మరోచోట ప్రభుత్వం స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దార్ ప్రసాద్‌కు ఆర్డీఓ ఆదేశించారు. డివిజనల్ సర్వేయర్ జనార్దనరావు, వసంత కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: బూర్జ మండలం కె.కె.రాజపురంలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జలుమూరు: హుస్సేనుపురంలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీపీ గోపి, నాయకులు



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం రావిచంద్రిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

‘వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు’



పాతపట్నం: బడ్డుమర్రిలో కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: కొత్తకోటలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎం చంద్రబాబు మోసపూరిత హామీలతో గద్దెనెక్కి, వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమనర్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు అన్నారు. పాతపట్నం మండలంలోని బడ్డుమర్రి, కొనంగి, బాసిగిట్టంగి, టి.కొత్తూరు, మలెయాపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రికాలింగ్ చంద్రబాబు కార్యక్రమాన్ని సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్డి శాంతి హాజరై.. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. సరుబుజ్జిలి మండలంలోని కొత్తకోట, మర్రిపాడు గ్రామాల్లో పార్టీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కింజరాపు సురేష్, స్థానిక ఎంపీటీసీ సురవరపు సింహాచలం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి క్యూఆర్‌కోడ్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. నరసన్నపేట మేజరు పంచాయతీలోని కొత్తవీధి, హడ్కో కాలనీల్లో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దండి జయప్రకాశ్, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని హుస్సేనుపురం, వెంకటాపురం పంచాయతీల్లో ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మధరావు, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు జి.వి.రమణి ఆధ్వర్యంలో, పోలాకి మండలంలోని ఈదులవలస గ్రామంలో మండలపరిషత్ సలమాదారు ముద్దాడ బైరాగినాయుడు ఆధ్వర్యంలో, ఎల్.ఎన్.పేట మండలం రావిచంద్రిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొర్ల లక్ష్మనాయుడు, కొర్ల రాము, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు ఆధ్వర్యంలో, బూర్జ మండలంలోని కె.కె.రాజపురం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో, ఆమదాలవలస మండలంలోని నెల్లిపర్తి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు ఆధ్వర్యంలో, కొత్తూరు మండలంలోని గొట్టిపల్లి, ఇరపాడగూడ, సిరుసువాడ, మహార్తాపురం, సిరుసువాడ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీపీ సవర సావిత్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: నెల్లిపర్తిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: కొత్తవీధిలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: సిరుసువాడలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: ఈదులవలసలో కూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీసీ నాయకులు

శ్మశానవాటిక రోడ్డు ఆక్రమణ



హిరమండలం మండలంలోని కిట్టాలపాడులో శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు ఆక్రమణకు గురైంది. పలువురు రైతులు రోడ్డును తవ్వేసి పొలాల్లో కలిపేశారు. దీంతో శ్మశానవాటికకు పొలం గట్లే మార్గంగా మారాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎవరైనా చనిపోతే అంతిమయాత్ర నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరి ఉభాలు జరగడంతో అతి కష్టమ్మీద పొలం గట్లపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– హిరమండలం

రహదారిపై మురుగునీరు..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని డొంకలబడవంజలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు. గ్రామంలోని మురుగునీటి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రహదారిపై నిల్వ ఉంటుంది. పగలు దుర్వాసన, రాత్రి దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– హిరమండలం

పీజీఆర్ఎస్‌కు 82 వినతులు



టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న కొదూరు గ్రామస్తులు

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి 82 వినతులు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 66, వ్యవసాయశాఖ-13, పంచాయతీ రాజ్-2, విద్యాశాఖకు సంబంధించి ఒక వినతి వచ్చాయి. కొదూరు, ప్రహరాజపాలెం గ్రామాల్లో రేషన్ డిపోలు లేకపోవడంతో 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న బగంతరకు వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలో చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని కొదూరు సర్పంచ్ పనుకు నాగమణి, కొదూరు, ప్రహరాజపాలెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రంకిణి, శివరాంపురం గ్రామాలకు బీటీ రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు వినతి అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న అన్నదాత సుఖీభవ తమకు అందలేదని కొదూరు, ప్రహరాజపాలెం, రంకిణి, బురికిపేటకు చెందిన జన్ని లక్ష్మి, దవ్వెల చిన్నమ్మడు, లాబర మహాలక్ష్మి, లాబర రవణమ్మ, గొడ్డురు చిన్నమ్మడుతోపాటు పలువురు ఫిర్యాదు చేశారు. వినతులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. డీఎల్‌డీఓ అలివేలు మంగమ్మ, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎం.ఎల్.వి.సత్యనారాయణ, వ్యవసాయశాఖ ఏడీలు పి.రామారావు, ఎం.కరుణాకరరావు, డీఈఈలు శిమ్మయ్య, జి.ప్రసాదరావు, తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓలు ఎ.గోవిందరావు, సి.హెచ్.తిరుమలరావు, డివిజనల్ సర్వేయర్ ఎం.జనార్దనరావు, డీటీ వెంకటరమణ, మండల అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి పట్టని రైతు సమస్యలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: రైతులు పడుతున్న సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీపీ సవర సావిత్రి అన్నారు. మండలంలోని గులివిందలపేటలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. వరి సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు కేవలం 25 కిలోల యూరియా పంపిణీ చేస్తే ఎలా సరిపోతుందన్నారు. రైతు సేవా కేంద్రాలకు కాకుండా.. ప్రైవేట్ డీలర్లకు యూరియా, డీఏపీ కేటాయించడం సరికాదన్నారు. ప్రైవేట్ డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు ఎరువులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎరువుల సమస్య రాకుండా చర్యలు తీసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రకటనలు చేశారు తప్ప.. ఇంతవరకు రైతులకు సరిపడినంత యూరియాను నియోజకవర్గానికి తీసుకురాలేదన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే.. ఇంతవరకు అటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. జిల్లాలోనే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నప్పటికీ.. ఎరువుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉందన్నారు. ఇప్పటికైనా రైతులకు అవసరమైన అన్ని ఎరువులూ ఆర్‌ఎస్‌కేల ద్వారా పంపిణీ చేయాలన్నారు. సర్పంచ్ యర్లంకి ధర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మరపాక శంకరావు, సవర రమేష్ పాల్గొన్నారు.

ఫోన్ల అప్పగింత



నరసన్నపేట: ఫోన్లు అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నరసన్నపేట/ఆమదాలవలస/పాతపట్నం/కొత్తూరు: అంగన్‌వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక యాప్‌లు తీసుకువచ్చి తమపై ఒత్తిడికి గురిచేస్తున్నాయని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కార్యకర్తలందరూ సోమవారం వారికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లను సీడీపీఓ, ఐసీడీఎస్ కార్యాలయాలకు అప్పగించారు. గతంలో ఇచ్చిన ఫోన్లు అన్ని యాప్‌లకు సపోర్ట్ చేయడం లేదని, అందువల్ల పని చేయలేకపోతున్నామన్నారు. అంగన్‌వాడీ సంఘం ప్రతినిధులు, సీఐటీయూ ప్రతినిధులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

మెళియాపుట్టి: రైతులుకు అవసరమైన ఎరువులను అందించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మోహన్‌రావు అన్నారు. సోమవారం చాపర సీఐటీయూ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా.. ఇంకా ఎరువుల కోసం రైతులు ఎదురు చూడాల్సిన దారుణమైన పరిస్థితిని కల్పించారని మండిపడ్డారు. నేటికీ ఎరువులు అందక రైతులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారని, అప్పులు చేసి ప్రైవేట్ షాపుల్లో అధిక ధరలకు యూరియా కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎరువు వేయాల్సిన సమయం దాటిన తర్వాత ఇచ్చినా ఫలితం ఉండదన్నారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితిని చూడలేదన్నారు. జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ మంత్రి ఉన్నా రైతులుకు మేలు జరగడం లేదన్నారు. రైతులకు తక్షణమే అవసరమైన ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

6న హుండీ కానుకల లెక్కింపు

పాతపట్నం: ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నారు. ఆలయ ఈఓ టి.వాసుదేవరావు సోమవారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఉదయం పది గంటల నుంచి కానుకలు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్ కోడ్ పాటించి లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.